## మంత్రాక్షతలు

'మేడమ్! మనం ఇంటర్వ్యూ చేయవలసిన కేండిడేట్సు అయిపోయారు. ఇక మన కార్యక్రమం పూర్తయినట్టే' ముఖానికి పట్టిన చెమటలు తుడుచుకుంటూ అన్నాడు సుధీర్.

'వచ్చిన వాళ్లంతా చాలా క్వాలిఫికేషన్సు వున్నవాళ్లే! అందరూ బాగానే చేశారు పాపం' సాలోచనగా అంటూ 'మీ అభిప్రాయం ఏమిటి? అన్నట్టు స్వరూప వైపు చూసాడు సాగర్.

'మనమాటకేం కానీ, మేడమ్ చాలా అలసిపోయారు. ముందు కాస్త టీ త్రాగి రిలాక్స్ అవుదాం' టేబుల్పై వున్న బెల్ నొక్కాడు సుధీర్.

'ఇక మనం విషయంలోకి వద్దాం' టీ పూర్తిచేసి ఖాళీ కప్పు శరభయ్యకు అందించేడు సాగర్.

'ఈ శ్రీనివాస్ అనే అబ్బాయిని సెలెక్టు చేస్తే బాగుంటుంది' స్వరూప మాటకి ఇద్దరూ విస్మయంగా చూసారు.

'బాగానే వుంటుందనుకోండి! ఆ చిన్నారావు, సూర్యం ఇంకా చురుకుగా ఉన్నారు. వాళ్లలో ఒకరైతే!? మీరు మరొకసారి ఆలోచించండి.. స్వరూపతో కాస్త బెరుకుగానే అన్నాడు సాగర్.

'అతనూ సరిగ్గానే చేసేడుగా! ప్రత్యేకించి ఆలోచించడానికి ఏమీ లేదనిపిస్తోంది' తన మనోభావాలు వ్యక్తం కానివ్వకుండా నిదానంగా అంది స్వరూప. తొందరగా శ్రీనివాస్ని ఉద్యోగస్తుణ్ని చెయ్యాలన్న ఆతృతతో ఇంక విషయాన్ని పొడిగించదలచుకోలేదు. 'మనం శ్రీనివాస్ని సెలక్టు చేసినట్లే' తేల్చి చెప్పేసింది.

'సారీ... స్వరూపగారూ! నేను ఒక్క విషయం చెప్పాలి.'

'చెప్పండి సుధీర్' కాస్త దురుసుగానే అంది.

'శ్రీనివాస్ని నేను ఎరుగుదును. మా ఊరివాడే. అతని ప్రవర్తన అంత మంచిది కాదు. ఇల్లు వొదిలి పారిపోయేడు. ఎక్కడెక్కడో తిరుగుతూ ఆ పనీ ఈ పనీ చేస్తూ ఎలాగో చదువు సాగించాడు. అలాంటి వ్యక్తి కన్నా క్రమశిక్షణతో పెరిగి, పెద్దల కనుసన్నలలో మెలిగి ఈ స్థాయికి వచ్చిన వాళ్లు సత్ప్రవర్తన కలిగి వుంటారు కదా! నేను చెప్పిన ఇద్దరిలో ఒకరికి ఈజాబ్ ఇవ్వడం సముచితం అనుకుంటున్నాను. మీ నిర్ణయం కాస్త తొందరపాటుతో తీసుకున్నారేమో అనిపిస్తోంది. స్వరూప కళ్లలోకి చూశాడు.

'శ్రీనివాస్ మీకు తెలుసా? అతని నడవడి గురించి కూడా మీరు చెప్తున్నారు కనక,

బాధ్యతాయుతమైన ఈ పోస్టుకి అనర్హుడే అని నాకూ అనిపిస్తోంది'...

ఇక విషయం దాచి లాభం లేదనుకుంటూ, ' మీ ఇద్దరి అభిప్రాయం ఇదే అన్నమాట. నా నిర్ణయానికి గల కారణం మీ ముందుంచుతాను. ఇంతకీ... సుధీర్ గారూ! మీదీ శ్రీకాకుళమేనా?' అన్నది, స్వరూప.

"శ్రీకాకుళమే. మా తాతగారి ఊరు. నా హైస్కూలు చదువంతా అక్కడే సాగింది. అప్పుడు ఈ కుర్రాడు మా తాతగారింట్లో పాలు పోసేవాడు. నేను సెలవులకి వెళ్లి వచ్చేసరికి వాడు తండ్రి పనిచేసే ఇంట్లో బంగారు నగ దొంగిలించి పారిపోయాడని ఊళ్లో అంతా చెప్పుకున్నారు. ఆ తర్వాత ఎక్కడెక్కడో అఘోరించి, నమ్మినవాళ్లెందరినో నట్టేట ముంచి చదువు వెలగబెట్టి వుండి వుంటాడు. తగుదునమ్మా అంటూ ఇలా బ్యాంకు మెసెంజరు ఉద్యోగానికి తయారయ్యాడు: గత చరిత్ర మనకు తెలిసే అవకాశం లేదనుకొని!" శ్రీనివాస్ పట్ల తనకి వున్న అసహ్యమంతా వెళ్లగక్కేడు సుధీర్.

'ఓహో! అంత ఘనుడా! అయితే స్వరూపగారూ: మీ అభిప్రాయాన్ని మార్చుకోవలసిందే' అన్నాడు సాగర్.

స్వరూప ఆలోచనలో పడిపోయింది. పనులు చకచకా చేస్తూ తిరుగాడిన పదేళ్ల శ్రీనివాస్ అమాయకపు రూపం ఆమె కళ్లముందు మెదులుతోంది. ఆనాటి సంఘటనలు ఒక్కొక్కటి గుర్తుకురాసాగాయి. తను మామయ్య గారింట్లో వుండి చదువుకొనే రోజులు. మామయ్యగారి పిల్లలిద్దరూ ఏ పనీ చేసుకొనేవారు కాదు. వాళ్లు బడికెళితే శ్రీను పుస్తకాల బేగులు మొయ్యవలసిందే! స్కూలు నుంచి వస్తూనే చిందరవందరగా పడేసిన పుస్తకాలు అందంగా షెల్ఫుల్లో సర్దేది శ్రీనే. పుస్తకాలు కళ్లకద్దుకొని శ్రీను ఎన్నోసార్లు కన్నీళ్లు పెట్టుకోవడం చూసింది తను. 'పుస్తకాలంటే నీకంత ఇష్టమేంట్రా? అయితే చదువుకుంటావా? అని తను అంటే ' నా బోటోడికి అంత అదృష్టమా బుల్లెమ్మా? ఇట్టా పశువుల్ని తోలుకుంటూ పాలమ్ముకుంటూ బతకాల్సిందే.. మా అయ్యా, అమ్మతోపాటు.' అన్నప్పుడు తన కళ్లలో నీళ్ళు చిందేయి.

'నిజమే! పశువుల మందలు తోలుకోవటం, తల్లిదండ్రులు పనిచేసే ఇళ్లల్లో సహాయ పడడం వీటితోనే వాడి రోజు గడిచిపోయేది. మావయ్య ఇంటికి బంధువులొస్తే చాలు... రోజంతా చాకిరీ చేస్తూ తమ ఇంటే వుండిపోయేవాడు. ఓసారి అత్తయ్య చెల్లెలు వచ్చింది. ఆవిడ కూతుళ్లిద్దరూ తన ఈడువాళ్లే. ఒంటినిండా బంగారు నగలు పెట్టుకొని ఎంతో దర్పంగా తిరిగేవాళ్లు. ఇంట్లో పిల్లలందరూ కలసి ఆడుకుంటున్నా తను మాత్రం పరీక్షలు దగ్గర పడుతున్నాయని చదువుకుంటూనే గడిపేది.

ఓ రోజు తను స్కూలునుంచి వచ్చేసరికి మావయ్య గట్టిగా అరుస్తూ శ్రీనుని గొడ్డుని బాదినట్లు బాదుతున్నాడు. తను అదిరిపడింది. ప్రొద్దున్నే తండ్రితో కలసి వచ్చి, తండ్రి పొలం పనికి వెళ్లిపోయాక వాడు ఇంట్లోనే ఈ పనీ, ఆ పనీ చేస్తూ వుంటున్నాడు. అత్తయ్య తన చెల్లెలితో

కబుర్లలో పడి అన్నం పెట్టడం మరచిపోయినా ఆకలని అడగలేని అమాయకుడు. 'వీడే తప్పు చేశాడబ్బా? ఎందుకు దెబ్బలు తింటున్నాడు' అనుకుంటూ తను అత్తయ్య దగ్గరకు వెళ్లింది. తను అడిగే లోగానే 'బొండు వెధవ తిన్నింటి వాసాలు లెక్కబెట్టాడు. మీ చిన్నత్తయ్య చిన్న కూతురు గొలుసు దొంగిలించేడే తల్లీ!'' అత్తయ్య దీర్ఘాలు తీస్తూ చెప్పింది. తనకి అది నిజం అనిపించలేదు. 'అయినా మన జాగ్రత్తలో మనం ఉండాలి. ఎక్కడ బడితే అక్కడ బంగారు వస్తువులు పడేస్తుంటే ఎవరైనా దొంగిలించవచ్చు. పాపం! వీడే అని ఎలా అంటాం?' శ్రీను మీద వున్న నమ్మకం తన చేత పెద్ద ఆరిందలా మాట్లాడించింది.

'చాల్లే చెప్పొచ్చేవ్. నోర్మూయ్! నీ మాటలు కాస్తా వాడి చెవికెక్కేట్టు అంటే, ఇంకా మొండికేస్తాడు. ఆ తండ్రి - కొడుకులు తప్ప అలాంటి వాళ్లెవరొస్తారు? ఖచ్చితంగా ఇది వీడి పనే' అంటూ అత్తయ్య కూడా శ్రీనుని చెడామడా తిట్టడం మొదలుపెట్టింది.

తనకేటూ తోచలేదు. సీతనడిగింది. 'నువ్వు ఎక్కడ పెట్టేవో గుర్తు తెచ్చుకో కూడదూ! పాపం.. వాడు తీశాడో... లేదో! ఎన్ని దెబ్బలు తింటున్నాడో!' అంది.

'బొమ్మల పెళ్లి ఆడుకుంటూ, ఆ పెద్ద బొమ్మ మెళ్లో వేసాను. అంతే. మరి కనిపించలేదు. వాడు కాక మరెవరు తీస్తారులే. తీసేడేమో, దెబ్బలు తింటున్నాడు. మధ్యలో మనకెందుకు?' తర్వాత తానింకేం మాట్లాడలేదు.

ఒళ్లంతా కళ్లు చేసుకొని ఇల్లంతా వెతికింది. దొరికితేగా!?. పుస్తకం తెరిచినా చదవబుద్ధి కాలేదు. కాస్త చీకటి పడేసరికి చిన్నత్తయ్య పిల్లలందరికీ అన్నాలు పెట్టింది. ఊరికే గొడవ పడడం ఎందుకని కంచం ముందు కూర్చుందే కాని, కాస్త కూడా తినలేకపోయింది. ఎందుకోగాని... శ్రీనుని అంటున్న ప్రతీ మాట. కొడుతున్న ప్రతీ దెబ్బ తనకే తగులుతున్నట్టన్పించింది. తను చిన్న పిల్లాయే! ఏం చెప్పినా తన మాట చెల్లదు. కానీ, వాడు దొంగమాత్రం కాదు. తనకి దుఃఖం ఆగలేదు. నెమ్మదిగా లేచి వెళ్లిపోయింది.

కొడుకుని తీసుకెళ్లడానికి వచ్చిన శివయ్య, సంగతి తెలిసి నిశ్చేష్టుడైపోయాడు. 'క్షమించండి బాబూ!.. అమ్మగోరూ! మీ పాదాలట్టుకుంటా. నా బిడ్డ అట్టాంటోడు కాదు. మా యింటా వంటా చెడు బుద్దుల్లేవు బాబూ!' ఎన్నో విధాల ప్రాధేయపడుతుంటే తను మౌనంగా వుండలేకపోయింది. కళ్లు తుడిచేసుకొని గభాలున అక్కడికెళ్లింది.

'ఎందుకు మావయ్యా ఇదంతా! పోలీసు రిపోర్టిద్దాం. అంతా వాళ్లే చూసుకుంటారు. ధైర్యం కూడదీసుకొని అనేసింది. మావయ్య మండిపడ్డాడు. 'గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించిందని.. ఏమిటే వాగుతున్నావ్' అంటూ తన పైకురికేడు.

'ఏం చెయ్యాలో మాకు తెలుసు. నీ బోడి సలహాలు ఎవరికి కావాలి?' అత్తయ్య తన రెక్క పుచ్చుకొని బరబరా లోపలికి లాక్కెళ్లింది.

అర్ధరాత్రి వరకు ఆ గలాటా అలా సాగుతూనే వుంది. ఎప్పటికో కొడుకుని ఇంటికి

తీసుకెళ్లాడు శివయ్య. తల్లీ తండ్రేనా మరిపిస్తారనుకుంటే అదీ జరగలేదు.

'సచ్చినెదవా! తినే కూటిలో బుగ్గోసేవు. సేత్తున్న పని పోగొట్టుకుంటే ఎట్టా దొరుకుద్దిరా? ఇప్పుడు మీ అయ్యనైనా గుమ్మమెక్కనిత్తారా? పాడుపని చేసేవ్. తప్పై పోనాదని ఒప్పేసుకోరా. ఆల్లొత్తువు ఆలకిచ్చేయ్. ఏడ దాసినావురా ... దొంగెదవా? అంటూ తల్లి కూడా కోప్పడింది.

'సత్తె పెమానంగా నాను తియ్యనేదు. ఏటైనా అను. నువ్వు సేతి కొచ్చినట్టు కొట్టు. దొంగని మాత్రం అనకే అమ్మా! నాను దొంగని కాదు. భోరు భోరున ఏడుస్తున్నాడు. చుట్టుపక్కల జనమంతా అక్కడే గుమిగూడేరు. ఎవరికి తోచిన మాట వాళ్లంటున్నారు. శ్రీను ఆ నగ తీసి వుండకపోవచ్చునీ, వాణ్ణి బాధ పెట్టవద్దనీ అంటున్న కొద్దిమంది తనకి దేవుళ్లలా కనిపించారు. తనూ అలానే కాసేపు నచ్చచెప్పి వచ్చేసింది.

స్కూలు నుంచి వచ్చినా, తనకి ఏ పనిమీదా బుద్ధి పోవడం లేదు. పెరట్లో మొక్కల మధ్య కుర్చీ వేసుకొని పుస్తకం తిరగేస్తూ కూర్చుంది. బావి దగ్గరకు వచ్చి మామయ్య, రమణయ్య శాస్త్రిగారు స్నానాలు చేస్తున్నారు. 'అరె! ఈ రోజు ఏ పూజా కాదే! అయితే, అత్తయ్య బోలెడు హడావిడి చేస్తోంది. ఇంట్లో ఎవరికి క్షణం తీరిక లేనన్ని పనులు చెప్తోంది. ఏమై వుంటుందబ్బా' వాళ్లనే గమనిస్తోంది. రమణయ్య శాస్త్రిగారు అక్షింతల పళ్లెం పట్టుకొని బిగ్గరగా మంత్రాలు చదవటం మొదలుపెట్టారు. కాస్సేపటికి ఆపి, తనపై మీద తువ్వాలు లోంచి చిన్న ముక్క చించి, దాంట్లో అక్షంతలు మూటగట్టి మామయ్య చేతుల్లో వుంచాడు. అత్తయ్య దగ్గరకు వచ్చి, ' ఇహ చూస్కోండమ్మా, ఖచ్చితంగా మీ నగ మీ ఇంటికి వస్తుంది. లేదా, ఆ కుర్ర కుంక చస్తాడు. మంత్రాక్షతలంటే మజాకా అనుకున్నారా! అంటుంటే తనకి విషయం బోధపడింది.

శ్రీను కళ్లల్లో మెదలటంతో ఆ రాత్రి కళ్లు మూత పడలేదు. మామయ్య తిరిగి రాగానే అత్తయ్యతో అంటున్న మాటలు వింటుంటే ఏడుపూ ఆగలేదు. 'వాడెంత గొడవ చేశాడు తెలుసా! మొరటు వెధవ. అక్షింతలు నెత్తిమీద పడకుండా ఒకటే పరుగులు. బలవంతాన పట్టుకొని జల్లేశానులే. గొలుసు దొంగిలించి వుంటే రేపీ పాటికి జ్వరంతో వణుకుతూ రక్తం కక్కుకుని చస్తావని అరచి మరీచెప్పాను.' ఆ క్షణం తను మాత్రం ఏదో తెలియని భయంతో వణికిపోయింది. అంతలోనే పిచ్చి ధైర్యం. 'శ్రీను దొంగ కానప్పుడు ఇవన్నీ జరగవుగా' అనుకుంది. తన ఊహాకందని సంఘటనలెన్నో ఒకదాని వెంట ఒకటి జరిగిపోయాయి.

శ్రీను జ్వరం వచ్చి, వాంతులు చేసుకొని, ఇల్లు విడిచి పారిపోయాడు. తను షాకు తింది. అయితే తన నమ్మకం ఉత్తదేనా! వీళ్లంతా అంటున్నట్టు వాడే గొలుసు తీశాడా? అప్పటికీ శ్రీనంటే అభిమానం చెదరని తను అలా అనుకోలేకపోయింది. శివయ్య ఇంటికి వెళ్లింది. అక్కడ శవం లేకపోవడం మినహా వాతావరణం అలానే వుంది. శివయ్య, శాంతమ్మ, వాడి చెల్లెలు, తమ్ముడు అంతా భోరు భోరున ఏడుస్తున్నారు. శ్రీనుని పోగొట్టుకున్నామని, వాడిక కంటికి కనిపించడని, వాడి తల్లిదండ్రులు గుండెలు బాదుకుని ఏడుస్తున్నారు. అలా వాళ్లని చూస్తూ తనూ వెక్కి వెక్కి ఏడ్చింది.

శివయ్య మాటే నిజమయింది. చిన్న మామయ్య వచ్చాడు. 'అందరూ పురమాయించే పనులు చకచకా చేస్తూ తలలో నాలుకలా తిరిగే శ్రీను కనిపించటం లేదేం?' అని మామయ్య అడిగేసరికి జరిగిందంతా ఏకరువు పెట్టిందత్తయ్య. మామయ్య దిమ్మెరపోయాడు.

'అరె! ఎంత పొరపాటు చేశారు. తొందరపడి ఇంతవరకు తీసుకొచ్చేరా! ఇంతకీ కారకుణ్ణి నేను' తల పట్టుకున్నాడు. మామయ్య చెప్పింది వినేసరికి ఇంట్లో అందరి ముఖాలు పాలిపోయాయి. తన స్థితైతే వర్ణనాతీతం.

అప్పుడు చిన్న మామయ్యన్న మాటలు ఇప్పటికీ చెవుల్లో గింగురు మంటున్నాయి. 'మీ అక్కయ్య ఇంట్లో అడుగు పెట్టావో- లేదో, పెత్తనాలు ప్రారంభించేవు. పిల్లలు ఇష్టమొచ్చినట్టు ఆటల్లో పడ్డా గమనించేవా? బంగారు గొలుసు బొమ్మకు పెట్టి ఆడుతుంటే, పోతుందని తీసి దాచాను. చెబుదామనుకుంటూనే కంగారుగా వూరెళ్లిపోయాను. ఫలితం ఒక పసివాని జీవితం బలైంది!

చిన్న మామయ్య రోజుల తరబడి దిగులుగానే వున్నాడు. తనకీ చదువు తలకెక్కలేదు. శివయ్యకి నిజం చెప్పేద్దామని ఎంత వాదులాడింది. తన ధోరణికి భయపడ్డ మామయ్య 'యీ పిల్ల ఇక మన ఇంట్లో వుండడం ప్రమాదం' అంటూ, అమ్మ నాన్న దగ్గరికి పంపేశాడు. తను చదువులో మునిగిపోయినా, దశాబ్దాలు గడిచిపోయినా, ఆ సంఘటనా, శ్రీను అమాయకమైన రూపం, తన మనసులోంచి మరుగవలేదు. ఆశ్చర్యంగా తన భర్తకు అతి నమ్మకస్తుడు అయిన వ్యక్తిగా తను శ్రీనుని చూసింది. ఏవో సందేహాలు అంకురించే లోగానే తరువాత కథ చెప్పి, తన విశ్వాసాన్ని రుజువు చేశాడు. 'ఎలాటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొన్నాడే తప్ప దొంగతనం అన్నా, మాయ పనులన్నా చివరికి అవసరార్థం అబద్ధం చెప్పటమన్నా శ్రీనుకి కిట్టదని గమనిస్తూ వచ్చాను.' అని భర్త చెప్తుంటే తను ఎంత ఉప్పొంగిపోయిందని. అందుకే యీ రోజు వచ్చిన అవకాశాన్ని యిలా సద్వినియోగపర్చాలనుకుంది.

తన మనోగతాన్ని సాగర్- సుధీర్ల ముందుంచింది. స్వరూప చెబుతున్నది వింటున్న ఆ యిద్దరూ నిశ్చేష్టులై వుండిపోయారు.

'మీ అభిప్రాయం నిస్సంకోచంగా చెప్పండి. ఇప్పటికీ శ్రీను ఈ పోస్టుకి అనర్హుడే అని మీరంటే, నా నిర్ణయమే మార్చుకుంటాను' సాలోచనగా వాళ్ల ముఖాల్లోకి చూసింది.

'సారీ.. స్వరూప గారూ! ఇంత జరిగుండొచ్చని నేనూహించలేదు. ఆ నోట, ఆ నోట విన్నదే తప్ప యథార్థం నాకూ తెలియదుగా!' అంటున్న సుధీర్ కళ్లల్లో రెండు కన్నీటి బొట్లు.

'మంత్రాక్షతలు, తాయెత్తులు- అంటూ మూఢ నమ్మకాలతో మనం ఎంత అధోగతికి పోతున్నామో- అనిపిస్తుంది. మీరనుకున్నట్టే కానివ్వండి' అన్నారు అంతా.

●